ప్రజాజ్యోతి
వరంగల్
ములుగు,మహబూబాబాద్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హన్మకొండ
బుధవారం 31-12-2025 పేజీలు : 8



భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ డిసెంబర్ 30 (ప్రజా జ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 31 డిసెంబర్ రాత్రి మరియు నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా, నిబంధనలకు లోబడి జరుపుకోవాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ప్రజలకు సూచించారు. ఇతరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బాధ్యతాయుతంగా వేడుకలు నిర్వహించాలని ఎస్పీ ప్రకటనలో తెలిపారు.నూతన సంవత్సర వేడుకల సందర్భంగా...

మిగతా 6లో...

## ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర

# వేడుకలు జరుపుకోవాలి

జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్




# నయా జోష్..

- జిల్లాలో కొత్త సందడి.. వేడుకలకు సిద్ధం
- పోలీసు నిబంధనలతో జాగ్రత్త - న్యూ ఇయర్ వేడుకలకు యువత ఏర్పాట్లు

వరంగల్ : కేరింతలు.. కేకలు.. సంబురాలు.. సంతోషాలు.. అంబరాన్ని తాకిన ఆనందాలు... కొన్ని దుఃఖాలు, చేదు అనుభవాలు, కాలం వదిలిన జ్ఞాపకాలను మిగిల్చి 2025 కొన్ని గంటల్లోనే వెళ్లిపోనుంది. 2026కి నయా జోష్‌గా స్వాగతం పలకడానికి జిల్లా వయోభేదం లేకుండా సిద్ధమవుతున్నారు. న్యూ ఇయర్ వేడుకలపై పోలీస్ నిఘా... నిబంధనలు, బందోబస్తు, ఆంక్షలు ఉండడంతో కొత్త ట్రెండ్‌గా యువత ఫ్యామిలీతోనే ఇళ్లలో ధూంధాంగా వేడుకలు జరుపుకోవడానికి సిద్ధమయ్యారు. బధవారం రాత్రి కొత్త సంవత్సరానికి స్వాగతం పలకడానికి జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ పట్టణల్లోని కాలనీల్లో, కొన్ని కొన్ని కుటుంభాలు కలిసి కొత్త వేడుకలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. డ్రంకెన్ డ్రైవ్, పోలీసుల తనిఖీల ఇబ్బందులు ఆంక్షలను దృష్టిలో పెట్టుకున్న యువకులు తమ ఫ్యామిలీలతో కలిసి సంబురాల జరుపుకోవడానికి ఇష్టపడుతున్నారు. ఇంట్లో వీలుకాని యువకులు హైదరాబాద్, బెంగుళూరు, గోవాలాంటి ప్రాంతాలకు వెళ్తున్నారు. జిల్లా అంతటా కొత్త సంవత్సరం సందడి అప్పుడే మొదలైంది. మద్యం షాపులు బిజీబిజీగా మారనున్నాయి. మద్యంప్రియులను దృష్టిలో పెట్టుకున్న ఎక్సైజ్ శాఖ ఈ సంవత్సరం కూడా మద్యం దుకాణాలు, బార్‌లు అర్ధరాత్రి వరకు తెరచి ఉంచే విధంగా చర్యలు తీసుకున్నారు. ప్రతి సంవత్సరం కొత్త సంవత్సరం సందర్భంగా మద్యం విక్రయాలు రూ.3 కోట్లకు పైగానే జరుగున్నాయి. కొంతకాలంగా నూతన సంవత్సర వేడుకల్లో మద్యం విక్రయాల క్రేజ్ వీపరితంగా పెరిగింది. మద్యం విక్రయాలు జోరుగా సాగుతాయని భావించి వైన్స్ యజమానులు నిల్వలు పెంచారు.



## పెండింగ్ బిల్లులు చెల్లించకుంటే కోర్టుకు వెళ్తాం

మాజీ సర్పంచుల నిరసన

7లో..

## భవిష్యత్ మీ చేతుల్లోనే

# ప్రాణాలను కాపాడుకోవాలి

జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలి ట్రాఫిక్ నిబంధన లను పాటించాలి : జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 30 (ప్రజాజ్యోతి) : ప్రాణాలు అతి ముఖ్యమని రోడ్ భద్రత నియమాలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. స్థానిక ఎన్.ఎం.ఆర్ గార్డెన్ లో మంగళవారం రోడ్ భద్రత, ప్రమాద నివారణ ల పైన ఆర్.టి.ఏ మెంబెర్ అభి గౌడ్ ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముఖ్య అతిదిగా హాజరయ్యారు.



# డీజే లకు అనుమతి లేదు,చైనా మాంజ ఉపయోగించినా విక్రయించినా చర్యలు తప్పవు

## గణపురం ఎస్ఐ రేఖ అశోక్

**గణపురం ప్రజాజ్యోతి డిసెంబర్ 30**: 2026 రాబోయే నూతన సంవత్సరం సందర్భంగా మండల వ్యాప్తంగా ఎవరైనా డీజే సౌండ్స్ పెట్టినా మద్యం తాగి వాహనాలు నడిపినా వారి పై చట్టరీత్యా చర్యలు తప్పవని గణపురం ఎస్ఐ రేఖ అశోక్ తెలిపారు. మంగళవారం గణపురం మండల పరిధిలోని డిజె సౌండ్ సిస్టం నిర్వాహకులను నూతన సంవత్సర సందర్భంగా డీజే సౌండ్ సిస్టం ను పెట్టకుండా ఉండేందుకు స్థానిక తహసీల్దార్ ముందు ఆరు నెలలకు రూ. లక్ష పూచికత్తుతో బైండోవర్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అదేవిధంగా సంక్రాంతి సందర్భంగా ఎవరైనా చైనా మాంజ ఉపయోగించినా విక్రయించినా షాపు యజమానుల పై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలంతా నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.



# రైతు కష్టాలు తీర్చడమే లక్ష్యంకోపాకుల చెరువు సాగు కాల్వ పనులను ప్రారంభించిన

## సర్పంచ్ శ్వేత రెడ్డి

**చెన్నారావుపేట డిసెంబర్ 30 ( ప్రజా జ్యోతి)**: చెన్నారావుపేట మండల కేంద్రంలోని కోపాకుల చెరువు ఆయకట్టు పరిధిలోని సాగు కాలువ మరమ్మత్తు పనులను మంగళవారం సర్పంచ్ కంది శ్వేతా రెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ... రైతన్నల సాగునీటి కష్టాలను తొలగించి ప్రతి ఎకరాకు నీరు అందించడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని సర్పంచ్ కంది శ్వేత కృష్ణ చైతన్య రెడ్డి అన్నారు.రైతులుఇబ్బంది పడకుండా ఉపాధి హామీ పథకం ద్వారా కాలువల పూడికతీత పనులు చేపట్టినట్టు సర్పంచ్ తెలిపారు. నాణ్యత విషయంలో ఎక్కడ రాజీపడకుండా పనులు పూర్తి చేసి పొలాలకు సాఫీగా నీరు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ పనుల ద్వారా స్థానిక కూలీలకు ఉపాధి దొరకడంతో పాటు రైతులకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో



ఉప సర్పంచ్ దొంతి శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ మండల అధికార ప్రతినిధి కంది కృష్ణ చైతన్య రెడ్డి,వార్డ్ మెంబర్ లక్కరాజు, పంచాయతీ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

# గణపురం సిఐ ని మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్ దంపతులు

**గణపురం ప్రజాజ్యోతి డిసెంబర్ 30 :** గణపురం సిఐ కరుణాకర్ రావు ను మంగళవారం సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో గణపురం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ రాధిక శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ అభివృద్ధిలో తమకు సహాయ సహకారాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. పాలనపరమైన విషయాలలో తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని ఈ సందర్భంగా సిఐ కరుణాకర్ సర్పంచ్ దంపతులకు హామీ ఇచ్చారు.



# చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ నీ తనిఖీ చేసిన నర్సంపేట ఏసిపి

## ఎస్సై మరియు సిబ్బందిపై ప్రశంసల జల్లు

**చెన్నారావుపేట డిసెంబర్ 30 ( ప్రజా జ్యోతి)**: చెన్నారావుపేట పోలీస్ స్టేషన్‌ను మంగళవారం నర్సంపేట ఏసిపి పి.రవీందర్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ నిర్వహణ, రికార్డుల నమోదు మరియు శాంతి భద్రతల పరిరక్షణలో సిబ్బంది తీరును ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. మూడు సంవత్సరాలకు సంబంధించిన కేసుల గురించి ఆరా తీసి, పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీలు, కేడీలు వారు ప్రస్తుతం చేస్తున్న కార్యకలాపాల గురించి తెలుసుకొని, నేరాలు నిరోధించాలని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఎటువంటి అసాంఘిక చర్యలు జరగకుండా చూడాలని శాంతి భద్రతలు కాపాడాలని తెలిపారు. తనిఖీల్లో భాగంగా స్టేషన్‌లోని క్రైమ్ రికార్డులు, రిజిస్టర్లు తనిఖీ చేసి, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను ఏసిపి తెలుసుకున్నారు. ప్రతి అంశాన్ని పక్కాగా రికార్డు చేయడంలో ఎస్.ఐ చూపిస్తున్న చొరవను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.తనిఖీ అనంతరం ఏసిపి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ చెన్నారావుపేట ఎస్సై మరియు పోలీస్ సిబ్బంది అత్యంత క్రమ శిక్షణతో, సమన్వయంతో పని



చేస్తున్నారని కొనియాడారు. మండలంలో నేరాల అదుపునకు సిబ్బంది పడుతున్న శ్రమను కొనియాడారు. అనంతరం ఆయన సిబ్బందితో మాట్లాడుతూ ఇదే ఉత్సాహంతో పని చేస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. బాధితులకు తక్షణ న్యాయం అందించడమే పోలీసుల ప్రథమ కర్తవ్యమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ సిఐ శ్రీనివాస్, ఎస్ఐ రాజేష్ రెడ్డి, ఏఎస్ఐ లక్ష్మణమూర్తి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వీరాచల రామచంద్రస్వామి లక్ష రూపాయల విరాళం

**లింగాల గణపురం, డిసెంబర్, 30 (ప్రజాజ్యోతి):-** మండలంలోని వీరాచల జీడికంటి శ్రీ రామచంద్ర స్వామి దేవస్థానం కు ఈరోజు కొండా.ప్రమోద్ రాజా,పద్మిని స్వామి వారికి 1,0116/- %అక్షరాల ఒక లక్ష నూట పదహారు రూపాయలు దేవస్థాన ప్రధాన అర్చకులు భార్గవాచార్యులు కి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**వాజేడు, డిసెంబర్ 30, (ప్రజాజ్యోతి):** అటవీలో సంభవించు అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, ప్లాస్టిక్ నిషేధంపై, వన్యప్రాణుల సంరక్షణ కొరకు వాజేడు మండలంలోని ధర్మవరం గ్రామం వద్ద క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించే ఆవరణలో క్రీడాకారులకు, యువతకు, ఆటను వీక్షించేందుకు వచ్చిన ప్రజలకు అటవీశాఖ చెరుకూరు సెక్షన్ ఆఫీసర్ ఎల్.నారాయణ అటవీశాఖ సిబ్బందితో కలిసి మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అటవీశాఖ చెరుకూరు సెక్షన్ ఆఫీసర్ నారాయణ మాట్లాడుతూ అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మన ప్రాంతంలోని అటవీలో జంతువులు ఎక్కువగా ఉన్నందున అటవీ ప్రాంతాల్లో పొరపాటున కూడా మంటలు పెట్టవద్దని, ఒకవేల అటవీ ప్రాంతంలో మంటలు చెలరేగినట్లయితే తక్షణమే అటవిశాఖ సిబ్బందికి సమాచారం అందించాలని, చీపుర్ల సేకరణ చేసేవాళ్లు జాగ్రత్తలు పాటించాలని, అడవులలో జీవరాశులు వాటి ఆవాసాలు కోల్పోతున్నాయని, ప్లాస్టిక్ ను వాడవద్దని, అటవీ ప్రాంతాల్లో ఉండే జంతువులకు హాని కలిగించవద్దని, ఔషధ మొక్కలు అంతరించిపోతున్నాయని, అడవుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ లు పద్మ, మనీషా, అటవీ శాఖ బేస్ క్యాంప్ సిబ్బంది, దామోదర్, జనార్దన్, రాంబాబు, అటవీ శాఖ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



# ఎస్పీ ని కలిసిన బుద్దారం సర్పంచ్ దంపతులు

**గణపురం ప్రజాజ్యోతి డిసెంబర్ 30**:గణపురం మండలం బుద్దారం గ్రామపంచాయతీ ఏకగ్రీవ సర్పంచ్ విడిదినేని శ్రీలత అశోక్ దంపతులు ములుగు ఎస్పీ కార్యాలయం లో ఎస్పీ రాంనాథ్ కేకన్ కోవింద్ గారిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి అవసరం వున్నా సహాయం సహకారాలు అందిస్తామన్నారు ఎస్పీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ శ్రీలత అశోక దంపతులు.



# వైకుంఠ ఏకాదశి సందర్భంగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

**గణపురం ప్రజాజ్యోతి డిసెంబర్ 30**: గణపురం మండల కేంద్రంలో ప్రసిద్దిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోట గుళ్ళు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ధనుర్మాసం సందర్భంగా శుక్ల ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతినెల గ్రామదేవతలకు నిర్వహించే పూజా కార్యక్రమాల్లో భాగంగా పంచామృతాలతో పాటు కాళేశ్వర త్రివేణి సంగమ జలాభిషేకం నిర్వహించారు. అనంతరం పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు నిర్వహించారు.



# తల్లిదండ్రుల ఆశయాలను గౌరవిస్తూ ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి: సీఐ శ్రీనివాస్

### సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి

### కోనాపురంలో 'జాగృతి' పోలీస్ కళాబృందం అవగాహన సదస్సు

### ముఖ్య అతిథిగా హాజరైన నెక్కొండ సిఐ శ్రీనివాస్

**చెన్నారావుపేటడిసెంబర్ 30 ( ప్రజా జ్యోతి):** చెన్నారావుపేట మండల పరిధిలోని కోనాపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన 'జాగృతి' పోలీస్ కళాబృందం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. సమాజంలోని రుగ్మతలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు నెక్కొండ సిఐ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ ప్రసంగిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు..ప్రతి యువకుడు/యువతి తమ తల్లిదండ్రులు నేర్పిన మంచి పద్ధతులను అలవర్చుకోవాలని, క్రమశిక్షణతోనే సమాజంలో గౌరవం లభిస్తుందని పేర్కొన్నారు.ప్రస్తుతం యువత ఎక్కువగా సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్నారని, సోషల్ మీడియా వాడకంలో మెలకువలు పాటించాలని సూచించారు. తెలియని లింకులను క్లిక్ చేయవద్దని, ఆర్థిక లావాదేవీల పట్ల జాగ్రత్తగా ఉండాలని కోరారు.యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, సమాజం పట్ల బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని హితవు పలికారు.



ముఖ్యంగా డ్రగ్స్ మద్యం వాటికి యువత బానిసై వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కోరారు.అనంతరం పోలీస్ కళాబృందం సభ్యులు తమ ఆటపాటల ద్వారా బాల్యవివాహాలు, మద్యపానం, సైబర్ మోసాలు వంటి అంశాలపై ప్రజలకు కళ్లకు కట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ లక్షణామూర్తి, హెడ్ కానిస్టేబుల్ ఇస్తార్,అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామానికి చెందిన యువత, ప్రజలు పాల్గొన్నారు.

# నారక్కపేట సర్పంచ్ సంపత్‌కు వీవోఏ ల ఘన సన్మానం

### వీవో అధ్యక్షులు పొన్నం వెంకటేశ్వర్లు

**నల్లబెల్లి, డిసెంబరు 30( ప్రజా జ్యోతి):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా నూతనంగా ఎన్నికైన వీ వో ఏ సంపత్‌ను మంగళవారం మండల వీ వో ఏ ల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బిఆర్ఎస్ మద్దతుతో భారీ మెజారిటీతో విజయం సాధించిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.మండల వీ వో అధ్యక్షులు పొన్నం వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఏపీఎం సుధాకర్, వరంగల్ జిల్లా వీ వో ఏ అధ్యక్షులు పోలుదాసరి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. తోటి కార్యకర్త ఉన్నత స్థాయికి ఎదగడం గర్వకారణమని, నారక్కపేట గ్రామ అభివృద్ధికి సంపత్ శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వీ వో ఏ ల సంఘం కార్యదర్శి ఇప్ప మమత, కోశాధికారి గాదం మైపాల్‌తో పాటు



రవీందర్, రవికుమార్, అరుణ, అనసూయ, మంజుల తదితరులు పాల్గొని నూతన సర్పంచ్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# వైకుంఠ ఏకాదశి వేడుకల్లో పాల్గొన్న ఈగ మల్లేశం

### భక్తుల నీటి అవసరాల కోసం ఆలయానికి బోరు మోటార్ విరాళం



**వర్ధన్నపేట డిసెంబర్ 30, ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా, వర్ధన్నపేట మండలకేంద్రంలో ఉన్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.అనంతరం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తుల నీటి అవసరాలను తీర్చేందుకు తమ సొంత ఖర్చులతో బోరు మోటార్‌ను కొనుగోలు చేసి ఆలయానికి విరాళంగా అందజేశారు. శ్రీ సీతారామచంద్ర స్వామి వారి సేవలో భాగస్వామి కావడం ఎంతో సంతోషంగా ఉందని ఈగ మల్లేశం ఈ సందర్భంగా తెలిపారు.ఈగ మల్లేశం సేవా భావాన్ని వర్ధన్నపేట పట్టణ ప్రజలు అభినందించారు.ఈ కార్యక్రమంలో తుమ్మల యాకయ్య, కొండేటి సత్యం, సమ్మెట శ్రీనివాస్, తుమ్మల రవీందర్, సమ్మెట రాంబాబు, మార్త సారంగపాణి, కరిమిల్ల సంపత్ రావు, పెద్దూరి రాజ్ కుమార్, యుగంధర్, సమ్మెట సుధీర్, చెన్న శ్రీధర్, గుజ్జ సోమేశ్వర రావు, కేదారి, మల్లెపాక అనిల్, ఆరెల్లి నాగార్జున, దొమ్మటి భాను చందర్, వడ్లకొండ రవీందర్, ఆలయ అర్చకులు కలకోట గోపాల చారి, రమణా చారి తదితరులు పాల్గొన్నారు.

# 100 పడకల ఆసుపత్రిపై కుట్ర

### ఎంసి చైర్మన్ నరుకుడు వెంకటయ్య ఆరోపణ

**వర్ధన్నపేట, డిసెంబర్ 29 (ప్రజా జ్యోతి):** వరంగల్ జిల్లా, వర్ధన్నపేట మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య మాట్లాడుతూ,వర్ధన్నపేట నియోజకవర్గానికి మంజూరైన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిపై కొందరు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.గతంలో ఎమ్మెల్యేగా ఉన్న అరూరి రమేష్ వర్ధన్నపేటకు 100 పడకల ఆసుపత్రి మంజూరు చేస్తానని పలు సభల్లో హామీలు ఇచ్చారని, అయితే ఆ హామీలు అమలుకు నోచుకోలేదని తెలిపారు. ఆ ప్రభుత్వం ఆసుపత్రిని మంజూరు చేయకుండా మాటలకే పరిమితమైందని విమర్శించారు.ప్రస్తుత ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మంత్రులు దనసరి సీతక్క, కొండ సురేఖల సహకారంతో వర్ధన్నపేట నియోజకవర్గానికి రూ.200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌తో పాటు 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని మంజూరు చేయించారని తెలిపారు.మూడు మండలాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మండలంలోని కత్రియాల గ్రామ రెవెన్యూ పరిధిలో, ఉప్పరపల్లి వెళ్లే దారిలోని ప్రభుత్వ భూమిలో ఇటీవల జిల్లా కలెక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారని చెప్పారు.అయితే దళితుడైన ఎమ్మెల్యే నాగరాజుకు ప్రజల్లో మంచి పేరు వస్తుందనే ఉద్దేశంతో కొందరు అగ్ర వర్ణాల నాయకులు కుట్ర పూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారని నరుకుడు వెంకటయ్య ఆరోపించారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో ఆసుపత్రికి అనువైన స్థలం లేనప్పటికీ, యువతను మరియు అన్ని పార్టీల నాయకులను రెచ్చగొడుతూ ఆసుపత్రిని వర్ధన్నపేట కేంద్రానికి తరలించాలని ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు.నాలుగు దశాబ్దాలుగా అగ్ర వర్ణాల పాలనలో వర్ధన్నపేటలో గణనీయమైన అభివృద్ధి జరగలేదని, అయితే గత రెండు సంవత్సరాలుగా ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు ప్రజల ఆశీర్వాదంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళు న్నారని పేర్కొన్నారు. ఈ అభివృద్ధిని అడ్డుకునేందుకే దుష్ప్రచారాలకు తెరలేపుతున్నారని విమర్శించారు.ఇప్పటికైనా భేషజాలకు పోకుండా, ఇప్పటికే భూమిపూజ జరిగిన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి అందరూ సహకరించాలని, ముఖ్యంగా అగ్ర వర్ణాలు మరియు పెత్తందారులు ఎమ్మెల్యే నాగరాజుకు మద్దతుగా నిలవాలని నరుకుడు వెంకటయ్య కోరారు.



# గ్రామాభివృద్ధే లక్ష్యంగా అధికారులను కలిసిన నూతన సర్పంచ్

**రఘునాథపల్లి, డిసెంబర్ 30( ప్రజాజ్యోతి):** రఘునాథపల్లి మండలంలోని కోడూరు గ్రామానికి నూతనంగా ఎన్నికైన సర్పంచ్ గోడిశాల లలితా%-%సోమయ్య గ్రామాభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా చేసుకుని ఉపసర్పంచ్, వార్డు సభ్యులతో కలిసి ఎంపీడీవో శ్రీనివాసులు , తహసీల్దార్ ఫణికిషోర్ , ఎస్ఐ నరేష్ యాదవ్ లను సోమవానం మర్యాదపూర్వకంగా కలసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న తాగునీరు, రోడ్లు, పారిశుధ్యం తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని కోరుతూ, తమ గ్రామానికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి అధికారులు సానుకూలంగా స్పందించారని సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చాగంటి యాదగిరి, వార్డు సభ్యులు దాసరి లక్ష్మి, భాషపాక మధు, దుబ్బాక స్వాతి%-%అజిత్, గౌడ వీరేష్, చిట్యాల స్వామి, టీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గోరిగే అంజయ్య , గోడిశాల హరీష్ తదితరులు పాల్గొన్నారు.



# నిస్వార్థ సేవతో మండల అభివృద్ధికి దోహదపడాలి

**మండల అధ్యక్షుడు బరిలో పలువురు ఆశవహులు**



**ఏటూర్ నాగారం డిసెంబర్ 30 ప్రజా జ్యోతి :**
పార్టీ మండల అధ్యక్షుడికి అవసరమైన లక్షణాలు, ఉన్నత విద్య ప్రాధాన్యతమండల స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో పార్టీ మండల అధ్యక్షుడి పాత్ర అత్యంత కీలకం. నిస్వార్థ సేవాభావంతో, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేసినప్పుడే పార్టీపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.మండల అధ్యక్షుడు వ్యక్తిగత లాభాలు పక్కనపెట్టి, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉంది. గ్రామాలు, వార్డులు తిరుగుతూ ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలవడం ద్వారానిజమైననాయకుడిగాగుర్తింపుపొందగలుగుతారు.నాయకత్వ గుణాలు, నిజాయితీ, పారదర్శకత, కమ్యూనికేషన్ నైపుణ్యం మండల అధ్యక్షుడికి తప్పనిసరి లక్షణాలుగా భావిస్తున్నారు. పార్టీ కార్యకర్తలను సమన్వయం చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా చూడాల్సిన బాధ్యత కూడా ఆయనదే.అదేవిధంగా, ఉన్నత విద్యకు కూడా కీలక ప్రాధాన్యత ఉంది. రాజ్యాంగం, పాలన, చట్టాలపై అవగాహన ఉన్న నాయకుడు ప్రజా సమస్యలను సమర్థంగా పరిష్కరించగలడని అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికారులతో సమర్థంగా వ్యవహరించడం, అభివృద్ధి ప్రతిపాదనలు రూపొందించడం, ప్రజల హక్కుల కోసం పోరాటం చేయడంలో విద్య కీలక పాత్ర పోషిస్తుంది.చదువు కలిగిన, నిస్వార్థ భావనతో పనిచేసే మండల అధ్యక్షుడు యువతకు ఆదర్శంగా నిలుస్తూ, పార్టీని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలోపేతం చేయగలడని పార్టీ శ్రేణులు విశ్వసిస్తున్నారూ.మొత్తంగా నిస్వార్థ సేవ, ప్రజలతో అనుబంధం, ఉన్నత విద్య కలిసినప్పుడే ఒక మండల అధ్యక్షుడు సమాజాభివృద్ధికి నిజమైన దిశానిర్దేశకుడిగా నిలుస్తాడని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.మండల అధ్యక్షుడు బరిలో పలువురు ఆశవహులు పోటీ పడుతునట్లు మండలంలో జోరుగా ప్రచారం సాగుతుంది. అధ్యక్షుడు పదవి ఎవరిని వరిస్తుందో అని ప్రజలలో ఆసక్తికరంగా చర్చ జరుగుతుంది.

# రైతన్నకు తప్పని తిప్పలు యూరియా కావాలంటే 'లాడిస్' కొనాల్సిందే

**లింకు దంత రైతుల నిలువు దోపిడి పట్టించుకోని అధికారులు**




**నెక్కొండ, డిసెంబరు 30(ప్రజా జ్యోతి):**
నెక్కొండ మండలంలో ఎరువుల విక్రయదారులు అన్నదాతల అవసరాన్ని ఆసరాగా చేసుకుని అదనపు దోపిడీకి తెరలేపారు. ప్రస్తుతం సాగు పనులు ఊపందుకోవడంతో పంటలకు యూరియా వినియోగం పెరిగింది. ఇదే అదనుగా భావిస్తున్న ఫర్టిలైజర్ షాపుల యజమానులు రైతులకు చుక్కలు చూపిస్తున్నారు. యూరియా బస్తా కావాలంటే దానితో పాటు సంబంధం లేని మందులను విక్రయిస్తూ పెట్టుబడి భారం పెంచుతున్నారు. **బలవంతపు విక్రయాలు.. బెంబేలెత్తుతున్న రైతులు:**సాధారణ యూరియా కోసం దుకాణాలకు వెళ్తున్న రైతులకు 'లాడిస్' లింక్ నిబంధన శాపంగా మారింది. ఒక బస్తా యూరియాతో పాటు తప్పనిసరిగా లాడిస్ కొనాల్సిందే లేదంటే నిల్వలు లేవని యజమానులు తెగేసి చెబుతున్నారు. కేవలం నానో మాత్రమే కాకుండా లాడిస్, నీలమందు, గడ్డిమందు వంటి అదనపు మందులను కూడా అంటగడుతున్నారు. దీనివల్ల రైతుపై అదనంగా వందల రూపాయల భారం పడుతోంది. వ్యాపారులు సాకులు చెబుతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.**అధికారుల పర్యవేక్షణ శూన్యం:**మండల కేంద్రంతో పాటు ప్రధాన గ్రామాలలోని విక్రయ కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నప్పటికీ, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే బహిరంగంగా నిబంధనల ఉల్లంఘన జరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. కృత్రిమ కొరత సృష్టించి యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండల వ్యాప్తంగా ఉన్న ఎరువుల నిల్వలపై అధికారులు వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమేస్పందించి పారదర్శకంగా యూరియా పంపిణీ జరిగేలా చూడాలి.అదనపు మందులను బలవంతంగా విక్రయించే షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని పంపిణీ కేంద్రాల ద్వారా నేరుగా రైతులకు ఎరువులు అందేలా ఏర్పాటు చేయాలని అధికారులు నిర్లక్ష్యం వీడి తనిఖీలు చేపట్టకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని నెక్కొండ రైతులు హెచ్చరిస్తున్నారు.

# దళితులను చిన్నచూపు చూస్తే కఠిన చర్యలు డిప్యూటీ తహసిల్దార్ గూడూరు రజిని



**చెన్నారావుపేట డిసెంబర్ 30 ( ప్రజా జ్యోతి) :**
చెన్నారావుపేట మండల కేంద్రంలోని ఖాదర్ పేట గ్రామంలోనీ ఎస్సీ కాలనీలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవం లో చెన్నారావుపేట డిప్యూటీ తాసిల్దార్ గూడూరు రజిని ముఖ్య అతిథిగా ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..సమాజంలో దళితులను చిన్నచూపు చూడటం చట్టరీత్యా నేరమని, అందరినీ సమానంగా గౌరవించాలని అన్నారు. సమాజంలో కులమతాలకుఅతీతంగాప్రతిఒక్క సమానమేనాని,అంటరానితనం వంటి వివక్షను ప్రదర్శించడం మానుకోవాలనీ అన్నారు.ఎవరైనా దళితుల పట్ల వివక్ష చూపినా లేదా చిన్నచూపు చూసినా వెంటనే అధికారులకు సమాచారం అందించాలని,అటువంటి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని, వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గూడ సంధ్య మహేందర్, సీహెచ్ఓ భద్రయ్య, ఏపీఓ అరుణ, ఐసీడీఎస్ సూపర్వైజర్ రాధ, అదనపు గిర్ధావర్ మమత, పంచాయతీ కార్యదర్శి రమేష్ ,కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# వాడబలిజలు ఐకమత్యంతో ఉండాలి

**- తెలంగాణ వాడబలిజ రాష్ట్ర అధ్యక్షులు దర్ర దామోదర్**



**వెంకటాపురం,డిసెంబర్ 30 (ప్రజాజ్యోతి):**
ములుగు జిల్లా వెంకటాపురం మండలం మహారాష్ట్ర రాష్ట్రం,గచ్చిరోలి జిల్లా,సిరవంచ మండలంలో మంగళవారం జరిగినటువంటి భారీ బహిరంగ సభకు తెలంగాణ వాడబలిజ రాష్ట్ర,జిల్లా,మండల కమిటీ సభ్యులు హాజరయ్యారు.ఈ సందర్భంగా తెలంగాణ వాడబలిజ రాష్ట్ర అధ్యక్షులు దర్రా దామోదర్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రం నుండి మమ్మల్ని అందరినీ భారీ బహిరంగ సభకు ఆహ్వానించడం పట్ల ఆనందంగా ఉందన్నారు.మహారాష్ట్ర వాడబలిజ సంఘం రాష్ట్ర కమిటీ వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.మనమంతా ఐక్యతగా ఉండాలని,ఈ ప్రాంతానికి మంచి పేరు ఉందని,సిరివంచతో తెలంగాణ రాష్ట్రానికి ఎంతో అనుబంధం ఉన్నదన్నారు.బ్రిటిష్ కాలం నుండి సిరివంచ తాలుకాగా భద్రాచలం నుండి ఈప్రాంతమంతా సిరివంచ తాలుకలో ఉందని మాపెద్దలు చెప్తూ ఉండేవారని అన్నారు.సిరువంచకు,తెలంగాణ,మహారాష్ట్రలో ఉన్నటువంటి వాడ బలిజలంతా కలిసికట్టుగా ఉంటే గొప్ప బలం ఉంటుందని,విడిపోతే బలహీన పడతామని తెలిపారు.మనమంతా కలిసికట్టుగా ఉంటే విజయానికి మార్గం చూపుతుందన్నారు.సభా ప్రాంగణంలో చిన్నారులు నృత్యాలతో అలరించారనిఎటువంటి సమస్య వచ్చినా తెలంగాణ రాష్ట్ర వాడబలిజ సేవా సంఘం తరఫున ముందుంటామని తెలిపారు.వాడ బలిజల ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలతో సభ ప్రాంగణమంతా హోరెత్తించారు.ఈ కార్యక్రమంలో వాడబలిజ సేవా సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి తోట మల్లికార్జునరావు,ఉపాధ్యక్షులు గార ఆనంద్,వ్యావస్థాపకులు డేనార్జన్ సీనియర్ నాయకులు,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు తోట ప్రశాంత్,అల్లిసూరిబాబు,కొప్పుల రఘుపతిరావు,ములుగుజిల్లా ఉపాధ్యక్షులు గార తిరుపతి,మండల అధ్యక్షులు గార నాగార్జునరావు,వైస్ ఎంపీపీ బొల్లె భాస్కర్ మండల అధికారి ప్రతినిధి బొల్లె నారాయణ,కోశాధికారి పానేం సురేష్,గౌరారపు రాంప్రసాద్,గార సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

**బియ్యం, నగదు పంపిణీ చేసిన పార్టీ శ్రేణులు**

**నల్లబెల్లి, డిసెంబరు 30( ప్రజా జ్యోతి ):**
నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన పత్తి సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మరణించగా, మంగళవారం బీఆర్ఎస్ నాయకులు ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ ప్రముఖులు బాధిత కుటుంబాన్ని కలిసి ధైర్యం చెప్పారు.అనంతరం సమ్మక్క కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిస్తూ, మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా వారి కుటుంబ అవసరాల నిమిత్తం క్వింటా బియ్యాన్ని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో నల్లబెల్లి గ్రామ సర్పంచ్ నాగెల్లి జ్యోతి ప్రకాష్, ఉప సర్పంచ్ గుమ్మడి వేణు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొత్తపల్లి కోటిలింగచారి, నాగవెల్లి శ్రీనివాస్, పరికి కోర్నెల్, భరత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ముక్కోటి ఏకాదశి పర్వదినం వేడుకలు

## ఏటూరునాగారం రామాలయం లో..ప్రత్యేక పూజా కార్యక్రమాలు

**ఏటూర్ నాగారం డిసెంబర్ 30 ప్రజా జ్యోతి :** ఏటూరునాగారం మండల కేంద్రం లోని రామాలయం లో మంగళవారం ముక్కోటి ఏకాదశి,వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉదయం నుండి అర్చకులు ఏళ్ల ప్రగడ నాగేశ్వరరావు శర్మ, చైర్మన్ అలువాల శ్రీనివాస్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే ఈరోజు మహా విష్ణువు కు ప్రీతి కరమైన రోజు, ఈరోజు మహా విష్ణువు బూ లోకానికి వచ్చే రోజు, ప్రతి ఒక్కరూ నారాయణ స్మరణ తో ఈరోజు ఉండాలి, కాబట్టి ఆలయ ప్రాంగణంలో మహిళలచే సామూహిక కుంకుమ అర్చన,ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. మహిళలు కుటుంబ సభ్యులతో వేకువజామునుంచే ప్రాంగణంలో ఆయా దేవాది దేవతల దర్శనం చేసుకొని, ఆలయానికి అధిక సంఖ్యలో పోటెత్తారు. విచ్చేసిన భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు ఉత్తర ద్వార దర్శనం గుండా లోనికి ప్రవేశించి మొక్కులు



చెల్లించుకున్నారు. ఇట్టి కార్యక్రమంలో చైర్మన్ అలువాల శ్రీనివాస్, గుంత రమేష్, తాడూరి దీన బందావ స్వామి, కత్తెర శ్రీనివాస్,గంపల శివ, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ కారులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ అమలు చేయాలి

## భూపాలపల్లి బీసీ సంఘం జిల్లా ఇంచార్జ్ విజయగిరి సమ్మయ్య



**మల్హర్, డిసెంబర్ 30 ప్రజాజ్యోతి :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని భూపాలపల్లి జిల్లా బిసి సంక్షేమ సంఘం ఇంచార్జి విజయగిరి సమ్మయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం కొయ్యూరు ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం కోసం శ్రీకాంతచారి, కానిస్టేబుల్ కిష్టయ్య, యాదయ్య లాంటి అనేక మంది ప్రాణత్యాగాలతో పాటు ఉద్యమకారులు, విద్యార్థులు, కళాకారులు అనేక మంది తమ తమ వత్తులు, వ్యాపారాలను పక్కన పెట్టి దశాబ్దాలుగా సకలజనుల సమ్మె, సహాయ నిరాకరణ, మిలియన్ మార్చ్ లాంటి ఎన్నో పోరాటాలు, త్యాగాల వల్ల ఏర్పాటు జరిగిన తెలంగాణ రాష్ట్రంలో గత టిఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమ కారులను విస్మరించిందని విజయగిరి సమ్మయ్య విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఉద్యమ కారులను ఆదుకుంటామని మానిఫెస్టోలో పేర్కొన్నారని తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యమ కారులకు 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్లు, హెల్త్ కార్డు, బస్, ట్రైన్ పాస్ లు ఇచ్చి జార?ండ్ తరహాలో ఆదుకుని న్యాయం చేయాలన్నారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు ఉద్యోగం, ఉద్యమకారులను గుర్తించి నామినేటెడ్ పదవులను ఇవ్వాలని అమరవీరుల ఆశయ సాధన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

# మండల కేంద్రంలో ఘనంగా పౌర హక్కుల దినోత్సవం

**పలిమెల డిసెంబర్ 30 (ప్రజా జ్యోతి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమేల మండల కేంద్రంలో తహసిల్దార్ అనిల్ ఆధ్వర్యం లో మంగళవారం రోజున పౌర హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పౌర హక్కుల దినోత్సవం లో భాగంగా పౌరులకు సమాజం లో హక్కులు, చట్టాలను, విధుల పై అవగాహన కల్పించిన అనంతరం స్థానిక ప్రజలు తమ తమ సమస్యలను వివరించడం తో సంబంధిత అధికారులు త్వరిత గతిన సమస్యలు పరిష్కరించాలని తహసిల్దార్ కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి, అటవీశాఖ రేంజ్ డిప్యూటీ అధికారి, రెవెన్యూ ఇన్స్పెక్టర్, జిపిఓ లు మరియు పలిమేల పోలీస్ స్టేషన్



అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గట్టి కల్ సర్పంచ్ చెవ్వ హేమలత కాశీనాథం ను సన్మానించిన మంత్రి వాకాటి శ్రీహరి

**రాయపర్తి డిసెంబర్ 30 ప్రజా జ్యోతి:** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం గట్టికల్లు గ్రామ నూతన సర్పంచిగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసి ఘన విజయం సాధించిన ముదిరాజ్ కులానికి చెందిన చెవ్వ హేమలత కాశీనాథం నుమంగళవారం రవీంద్ర భారతి లో తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకాటి శ్రీహరి ఘనంగా సన్మానించారు. సందర్భంగా సర్పంచ్ హేమలత కాశీనాథం మాట్లాడుతూ తన మీద నమ్మకంతో సర్పంచిగా గెలిపించిన ఘటికల్ గ్రామ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి జిల్లాలోనే నెంబర్ వన్ స్థానంలో నిలుపుతానని ఆమె అన్నారు. ముదిరాజ్ కుల బాంధవులు, రాష్ట్ర



మంత్రి వాకాటి శ్రీహరి కి కృతజ్ఞతలు తెలిపారు.

# బీఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ సీఎం కేసీఆర్ ని కలిసిన ఎర్రబెల్లి



**రాయపర్తి డిసెంబర్ 30 ప్రజా జ్యోతి:** హైదరాబాదులోనిజినందినగర్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. మరియు ఎం ఆర్ ఐ తిరుపతి రెడ్డి. ఇటీవలజరిగిన పంచాయతీ ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ కి మంచి ఫలితాలు రావడం పట్ల కేసీఆర్ మాజీ మంత్రి ఎర్రబెల్లిని అభినందించారు. ఇదే ఉత్సాహంతో రానున్న ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించాలని అన్నారు.

# కొండేటి శ్రీకాంత్ను పరామర్శించిన

## ఎస్ ఆర్ ఆర్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

### 10వేల రూపాయల ఆర్థిక సహాయం



**రాయపర్తి డిసెంబర్ 30 ప్రజా జ్యోతి:** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొండాపురం గ్రామానికి చెందిన కొండేటి శ్రీకాంత్ ఇటీవల పక్షవాతంతో బాధపడుతున్న సందర్భంగా వారిని రాష్ట్ర మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు హైదరాబాద్ తిలక్ నగర్ లోని వారి నివాసంలో పరామర్శించి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారికి10,000 రూపాయలు ఆర్థిక సహాయం చేసిన ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డి. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి గజవెల్లి ప్రసాద్, గ్రామ పార్టీ ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు .

# కల్లు గీత కార్మిక సంఘం నూతన మండల కమిటీ ఎన్నిక

**వర్ధన్నపేట, డిసెంబర్ 30, ప్రజా జ్యోతి.** వర్ధన్నపేట మండలంలోని కల్లుగీత కార్మిక సంఘం నూతన మండల కమిటీ ఎన్నిక మంగళవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లా అధ్యక్షులు తాళ్లపెల్లి నర్సయ్య గౌడ్ , జిల్లా ప్రధాన కార్యదర్శి మేరుగు వీరస్వామి గౌడ్, జిల్లా సహాయ కార్యదర్శి బాలగాని రాంబాబు గౌడ్, పర్వతగిరి మండల అధ్యక్షుడు బండి సతీష్ గౌడ్ హాజరై కల్లు గీత కార్మిక సంఘం వర్ధన్నపేట నూతన మండల కమిటీ ఎన్నిక మంగళవారం వర్ధన్నపేట మండలంలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో భాగంగా మండల గౌరవ అధ్యక్షులుగా సుదగాని లక్ష్మణ్ గౌడ్, అధ్యక్షుడిగా జనుగాం యాకయ్య గౌడ్ , ఉపాధ్యాయులు ,సోషల్ మీడియా కన్వీనర్ కత్తి వేణు కుమార్ గౌడ్, మేరుగు రాజాలు గౌడ్, కొయ్యేటి కుమారస్వామి గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి సట్ల సూరయ్య గౌడ్, సహాయ కార్యదర్శి బూర అశోక్ గౌడ్, బొల్లెపల్లి కుమారస్వామి గౌడ్, మడత ప్రశాంత్ గౌడ్, కార్యవర్గ సభ్యులు కత్తి రాజు గౌడ్,బూర సంపత్ గౌడ్, సట్ల నరసింహులు గౌడ్, ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ గౌడ కుల అభివృద్ధికి తెలంగాణ కల్లుగీత కార్మికుల సంఘం లక్ష్యాల కోసం కృషి చేస్తామని, మాపై నమ్మకంతో మండలంలోని అధ్యక్ష ,ఉపాధ్యక్ష , ప్రధాన కార్యదర్శి లుగా నియమించినందుకు జిల్లా కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ తాళ్లపల్లి నర్సయ్య గౌడ్ , మెరుగు వీరస్వామి గౌడ్, బాలగాని రాంబాబు గౌడ్ , మండలంలోని వివిధ గ్రామాల గౌడ సంఘం అధ్యక్షులు ఉపాధ్యక్షులు గౌడ కులస్తులు పాల్గొన్నారు.



# ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలి

**జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**



**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ డిసెంబర్ 30 (ప్రజా జ్యోతి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 31 డిసెంబర్ రాత్రి మరియు నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా, నిబంధనలకు లోబడి జరుపుకోవాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ప్రజలకు సూచించారు. ఇతరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బాధ్యతాయుతంగా వేడుకలు నిర్వహించాలని ఎస్పీ ప్రకటనలో తెలిపారు.నూతన సంవత్సర వేడుకల సందర్భంగా శాంతి%-%భద్రతలకు భంగం కలగకుండా జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.రాంగ్ సైడ్ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్, స్పీడ్ రేసింగ్, ట్రిపుల్ రైడింగ్ వంటి చర్యలు చట్టవిరుద్ధమని, వీటిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడిపితే, వారిపై మాత్రమే కాకుండా వారి తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేయబడతాయని తెలిపారు.పోలీస్ అనుమతులు లేకుండా ర్యాలీలు, సభలు, సమావేశాలు, ఈవెంట్లు, బహిరంగ కార్యక్రమాలు నిర్వహించరాదని, జిల్లావ్యాప్తంగా పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని గుర్తు చేశారు. ప్రైవేట్ ఈవెంట్లు నిర్వహించదలచిన వారు తప్పనిసరిగా పోలీస్ మరియు ఎక్సైజ్ శాఖల అనుమతులు పొందాలని సూచించారు.రోడ్లపై కేక్ కటింగ్‌లు చేయడం, టపాకాయలు వెలిగించడం, బైక్ రేసింగ్‌లు నిర్వహించడం చట్టప్రకారం నేరమని తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.యువత నిబంధనలను పాటిస్తూ, బాధ్యతాయుతంగా నూతన సంవత్సర వేడుకలను జరుపుకుని, పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.

# ప్రజల త్రాగునీటి కష్టాలు తీర్చిన కాంగ్రెస్ నాయకులు

**ఏటూర్ నాగారం డిసెంబర్ 30 ప్రజా జ్యోతి :** ఏటూర్ నాగారం మండల కేంద్రంలో ని మానస పల్లి 12 వార్డు గ్రామంలో త్రాగు నీటి కి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవడంతో త్రాగు నీటి సమస్య ను గ్రామ ప్రజలు స్థానిక నాయకులకు తెలపడం తో ఇట్టి విషయ ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్ కి తెలపడం తో మంత్రి సీతక్క దృష్టికి సమస్య ను తీసుకొని వెళ్లి మంత్రి ఆదేశాల మేరకు గుడ్ల దేవేందర్ సూచనల మేరకు వారి స్వంత ఖర్చుల తో గ్రామంలో 2 చోట్ల బోర్ పాయింట్లలో నూతన మోటర్లు వేసి గ్రామంలో ప్రజలకు త్రాగునీటి సమస్య తీర్చడం జరిగింది. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి అంటే కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం అంటూ ప్రజలు వాపోతున్నారు. మనసపల్లి 12 వార్డు గ్రామంలో నిరుపేద కుటుంబాలను గుర్తించి 13 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ కి గ్రామ ప్రజలు ఋణ పడి ఉంటామన్నరూ. రేషన్ కార్డులు ఇచ్చి పెద్ద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తూ. 200 మీటర్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందని గ్రామములో సిసి రోడ్లు. సైడ్ కాలువలు నిర్మించడం జరిగింది అన్నారు. గ్రామంలో యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా మద్యం నిషేధించాలి యువత కు ఉపాధి అవకాశాలు కల్పించాలని గ్రామంలో ఎస్సీ



కమిటీ హాల్ నిర్మాణం చేపట్టి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు గ్రంథాలయ సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కొంతమంది అర్హులైన నిరుపేదలు పూరి గుడిసెలో జీవనం గడుపుతున్నారని వారిని గుర్తించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వేడుకున్నారు. చిట్టి సమస్యను మంత్రి సీతక్క దృష్టికి తీసుకొని వెళ్లి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని స్థానిక నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నామా కరం చదు గాంధీ. సర్వ అక్షిత్ కుమార్.గంపల శివకుమార్. పడిదల హనుమంత్. నెగరకంటి ముఖేష్. పాగా నాగరాజు. పోల బోయిన గోపాల్. సర్వ సాయి.తదితరులు పాల్గొన్నారు.

# చెన్నారావుపేటలో ఉచిత కంటి వైద్య శిబిరం

**కంటి సమస్యలు ఉన్నవారు ఈ ఉచిత శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్ కంది శ్వేత కృష్ణ చైతన్య రెడ్డి**



**చెన్నారావుపేట డిసెంబర్ 30 ( ప్రజా జ్యోతి):** చెన్నారావుపేట మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో శరత్ మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక సర్పంచ్ కంది శ్వేత కృష్ణ చైతన్య రెడ్డి, ఉపసర్పంచ్ దొంతి శ్రీనివాస్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ శిబిరంలో శరత్ ఐ స్పెషలిటీ వైద్య బృందం పాల్గొని, కంటి సమస్యలతో బాధపడుతున్న పలువురు గ్రామస్తులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు సమస్యతో బాధపడుతున్న వారికి కంటి సంరక్షణపై పలు సూచనలు మరియు జాగ్రత్తలు తెలియజేశారు.సర్పంచ్ కంది శ్వేత మాట్లాడుతూ…ప్రజల ఆరోగ్యమే పరమావధిగా ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. కంటి చూపు సమస్యలతో ఇబ్బంది పడే వారు ఈ ఉచిత శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి. రాబోయే రోజుల్లో మరిన్ని ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తాం" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, వైద్య సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# చదువు, క్రీడలు రెండూ ముఖ్యమే

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**జనగామ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 30 (ప్రజాజ్యోతి) :** చదువు, క్రీడలు రెండు ముఖ్యమేనని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లాలోని ధర్మకంచ మినీ స్టేడియం లో జిల్లా స్థాయి పి.ఎమ్.శ్రీ పాఠశాలల విద్యార్థుల క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హాజరై, జ్యోతిప్రజ్వలన, జాతీయ పతకావిష్కరణ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీఎంశ్రీ పాఠశాలలకి ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుందని వాటితో విద్యార్థులు లబ్ది పొందాలని, చదువుతో పాటు ఆటలు కూడా బాగా ఆడాలని, చదువు ఆటలు రెండు ముఖ్యమే అని తెలిపారు. ఇతర పాఠశాల విద్యార్థుల ఆట తీరు చూసి, క్రీడల్లో మెలకువలు నేర్చుకునే అవకాశాలు చాలా ఉంటాయని అలాంటి వాటిని గమనించి నేర్చుకోవాలని సూచించారు. అనంతరం క్రీడ జట్ల వద్దకి వెళ్లి బాగా ఆడాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ఏ.డీ.సత్యనారాయణ మూర్తి, సి.ఎం.ఓ.నాగరాజు, ఎస్.జి.ఎఫ్. సెక్రెటరీ గౌర్ సింగ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధే ధ్యేయంగ శ్రమదానం

**పరిశుభ్రమైన గ్రామం గ్రామాభివృద్ధి లక్ష్యం**

**గ్రామ సర్పంచ్ రాయిని యాకన్నా**



**రాయపర్తి డిసెంబర్ 30 ప్రజా జ్యోతి:** కొండూరు గ్రామంలో పరిశుభ్రత అభివృద్ధి కార్యక్రమంలో భాగంగాగ్రామ సర్పంచ్ రాయిని యాకన్న గ్రామా కార్యదర్శి : నిమ్మల రాజు గ్రామ కారోబార్ : గుడెల్లి నరేష్ గ్రామ పార్టీ అధ్యక్షులు గిరిగాని రాజు గ్రామ పార్టీ ఉపాధ్యక్షులు గుంటుక యాకయ్య గ్రామ పార్టీ నాయకులు పంతంగి యాకయ్య, తాళ్లపల్లి నిశాంత్ రావు, అబ్బోజు క్రిష్ణ,యాకయ్య తదితరులు పాల్గొని గ్రామ పంచాయతీ సిబ్బందితో కలసి రహదారి పక్కన ఉన్న కాలువలు, పరిసర ప్రాంతాలను శుభ్రం చేయడం జరిగింది.పరిశుభ్రమైన గ్రామం ఆరోగ్యవంతమైన ప్రజలు అనే నినాదంతోగ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా మరో ముందడుగు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# మృతుడి కుటుంబానికి సర్పంచ్, గ్రామస్థుల ఆర్థిక చేయూత

**గణపురం ప్రజాజ్యోతి డిసెంబర్ 30:** గణపురం మండలం నగరంపల్లి గ్రామానికి చెందిన చిలువేరు కుమార్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబానికి సర్పంచ్ కొడారి హైమావతి ధనుంజయ యాదవ్ ఆధ్వర్యంలో రూ.5 వేలు, గ్రామస్థుల రూ.12 వేలు మొత్తం 17 వేలను వారి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు సర్పంచ్ దంపతులకు కుమార్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దంసాని శ్రీకాంత్, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఇడబోయిన సంతోష్ యాదవ్, తొట్ల రాజ గొల్ల యాదవ్, శ్రీ పెళ్లి రమణాచారి లు పాల్గొన్నారు.



# సికిల్ సెల్ వ్యాధిలో అరుదైన ప్రాణాపాయ లివర్ సమస్యకు మెడికవర్ హాస్పిటల్ వరంగల్‌లో విజయవంతమైన చికిత్స



**వరంగల్ సిటీ, డిసెంబర్30(ప్రజాజ్యోతి):** మెడికవర్ హాస్పిటల్ వరంగల్ వైద్యులు సికిల్ సెల్ వ్యాధితో బాధపడుతున్న 16 ఏళ్ల బాలుడిలో ఏర్పడిన అత్యంత అరుదైన మరియు ప్రాణాపాయకరమైన ఆక్యూట్ హెపాటిక్ సీక్వెస్ట్రేషన్ అనే లివర్ సమస్యను విజయవంతంగా నిర్వహించి రోగి ప్రాణాలను కాపాడారు. రోగి ఆసుపత్రికి చేరుకునే సమయానికి తీవ్రమైన జ్వరం, అధిక బలహీనత, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తీవ్రమైన పసుపు (జాండిస్) మరియు కాలేయం–ప్లీహాల అసాధారణంగా పెరగడం వంటి తీవ్రమైన లక్షణాలతో అత్యంత సంక్షోభ స్థితిలో ఉన్నాడు. ప్రాథమిక పరీక్షల్లో తీవ్రమైన రక్తహీనత, కాలేయ పనితీరులో లోపం మరియు బహుఅవయవాలపై ఒత్తిడి ఉన్నట్లు గుర్తించారు. సమగ్ర వైద్య పరీక్షలు మరియు వివిధ విభాగాల వైద్యుల సమన్వయంతో చేసిన పరిశీలన అనంతరం, సికిల్ సెల్ వ్యాధిలో అరుదుగా కనిపించే ఆక్యూట్ హెపాటిక్ సీక్వెస్ట్రేషన్ అని నిర్ధారణ చేశారు. ఈ పరిస్థితిలో వంకరగా మారిన ఎర్ర రక్తకణాలు కాలేయంలో చిక్కుకుపోయి, కాలేయం అకస్మాత్తుగా పెద్దదవడం, హీమోగ్లోబిన్ స్థాయి వేగంగా పడిపోవడం వంటి ప్రాణాపాయ సమస్యలు తలెత్తుతాయి. ఈ అత్యంత క్లిష్టమైన కేసును డా. వెంకటేశ్వర రావు, కన్సల్టెంట్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, మెడికవర్ హాస్పిటల్స్ వరంగల్ నేతృత్వంలో, క్రిటికల్ కేర్, హీమటాలజీ మరియు ఇంటర్నల్ మెడిసిన్ విభాగాల వైద్య బృందాల సమిష్టి సహకారంతో సమర్థవంతంగా నిర్వహించారు. సమయోచితమైన చికిత్స, నిరంతర పర్యవేక్షణ మరియు ఆధునిక వైద్య సదుపాయాల ద్వారా రోగి పరిస్థితి క్రమంగా మెరుగుపడి ప్రస్తుతం ఆరోగ్యంగా కోలుకుంటున్నాడని వైద్యులు తెలిపారు.

# భవిష్యత్ మీ చేతుల్లోనే ప్రాణాలను కాపాడుకోవాలి

**జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలి ట్రాఫిక్ నిబంధన లను పాటించాలి : జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**జనగామ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 30 (ప్రజాజ్యోతి) :** ప్రాణాలు అతి ముఖ్యమని రోడ్ భద్రత నియమాలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. స్థానిక ఎన్.ఎం.ఆర్ గార్డెన్ లో మంగళవారం రోడ్ భద్రత, ప్రమాద నివారణ ల పైన ఆర్.టి.ఏ మెంబెర్ అభి గౌడ్ ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముఖ్య అతిదిగా హాజరయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ భౌగోళికంగా జిల్లాలో నేషనల్ హైవే, ప్రధాన రహదారులు ఎక్కువ విస్తీర్ణం తో ఉన్నాయని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండ పాటించాలన్నారు. మితిమీరిన వేగం తో ప్రమాదం బారిన పడ్డ వ్యక్తి వల్ల వారి కుటుంబ సభ్యులు ఆర్థికంగా, మానసికంగా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవాలిసి వస్తుందన్నారు. రోడ్ భద్రత నియమాలు తప్పనిసరి అని, నిర్లక్ష్యం చేయకూడదని ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలని తెలిసి ఉండాలని, వాటిని అందరూ పాటించాలన్నారు. లైసెన్స్, ఇన్సూరెన్స్ ను తప్పకుండ కలిగి ఉండాలని, హెల్మెట్ ని ధరించాలన్నారు. సెల్ మాట్లాడుకుంటూ, మద్యం సేవించి డ్రైవింగ్ చేయొద్దని, మితిమీరిన వేగంతో వాహనాలని నడపవద్దని కలెక్టర్ సూచించారు. ఎవరైనా డ్రగ్స్ తీసుకుంటున్నట్టు గమనిస్తే వెంటనే తమకు సమాచారం ఇస్తే వారికి 10,000 రూపాయల రివార్డ్ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, ఆర్.టి.ఏ మెంబెర్ అభి గౌడ్, వివిధ కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులు చెల్లించకుంటే కోర్టుకు వెళ్తాం

**మాజీ సర్పంచుల నిరసన**



**నెక్కొండ, డిసెంబర్ 30 (ప్రజాజ్యోతి):** గ్రామాల్లో గత ఐదేళ్లుగా చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని నెక్కొండ మండల మాజీ సర్పంచులు డిమాండ్ చేశారు. మంగళవారం మాజీ ఎంపీపీ గటిక అజయ్ కుమార్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు తమ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం సమర్పించారు. అప్పులు తెచ్చి పనులు చేశాం 2019 నుంచి పల్లె ప్రగతి, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, రైతు వేదికలు వంటి పనులను అధికారుల ఆదేశాల మేరకు అప్పులు తెచ్చి పూర్తి చేశామని మాజీ సర్పంచులు తెలిపారు. ఒక్కో గ్రామంలో రూ. 12 లక్షల నుండి రూ. 30 లక్షల వరకు, మండల వ్యాప్తంగా సుమారు నాలుగు కోట్ల రూపాయలకు పైగా బిల్లులు రావాల్సి ఉందని పేర్కొన్నారు. అప్పులకు వడ్డీలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి పాత బకాయిలను చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీలకతీతంగా నూతన పాలకవర్గాలు కూడా తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తుంటే పోలీసులు అడ్డుకోవడం సరికాదని మండిపడ్డారు. వెంటనే బిల్లులు చెల్లించని పక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గట్టిక అజయ్ కుమార్, నాయకులు కొమ్ము రమేష్ యాదవ్, తాటిపల్లి శివకుమార్, కారంగుల సురేష్, మాజీ సర్పంచులు మాదాసు రవి, ఆలకుంట్ల నరేందర్, గాడుదుల కుమార్, బానోతు స్వరూప రవి, లింగాల విజయ వెంకన్న, శైలజ ప్రభాకర్, ఆంగోత్ భీమ్లా, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# బంగారు పతక విజేతకు అభినందనలు



**వరంగల్ సిటీ, డిసెంబర్ 30(ప్రజాజ్యోతి):** రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో బంగారు పతకాన్ని సాధించిన కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి కోట హనుక్ ను అభినందించారు. ఇటీవల మహబూబ్ నగర్ లో జరిగిన 69వ స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీలలో హ్యాండ్ బాల్ ఆటలో కోట హనుక్ పాల్గొని బంగారు పథకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల లో జరిగిన అభినందన సభలో విద్యార్థి కోట హనుక్ ను మరియు పి ఈ టి అనిల్ ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రావూరి మాధవి మరియు ఉపాధ్యాయ బృందం అభినందించారు. విద్యార్థి హనుక్ రాబోయే జాతీయ స్థాయి పోటీలలో కూడా ప్రతిభను కనపరిచి మన జిల్లాకు,రాష్ట్రానికి పేరు తేవాలని ఆశించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఉపాధ్యాయులు రాజ్ కుమార్,రమేష్,రాజమౌళి, పోగు అశోక్, శైలజ, కరుణకుమారి, అనూష, గౌస్, రవీందర్ రెడ్డి నరసయ్య ,విశ్వప్రసాద్, పావని మమత తదితరులు పాల్గొన్నారు.

# నల్లబెల్లిలో రెడీమిక్స్ ప్లాంట్‌పై విచారణ ప్రారంభం

**కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి దిగిన అధికారులు**



**నల్లబెల్లి, డిసెంబరు 30( ప్రజా జ్యోతి):** నల్లబెల్లి మండల కేంద్రంలోని కాంక్రీట్ రెడీమిక్స్ ప్లాంట్ నిర్వహణపై మంగళవారం అధికారులు విచారణ చేపట్టారు. ఈ ప్లాంట్‌కు చెందిన భారీ వాహనాలు ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా ఎస్సారెస్పీ కాలువ కట్టపై నుంచి రాకపోకలు సాగిస్తున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు.రెడీమిక్స్ ప్లాంట్ నుండి వెలువడుతున్న విపరీతమైన ధూళి కారణంగా సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు తీవ్ర అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు బత్తిని మహేష్ ఆధ్వర్యంలో ఇటీవల రాస్తారోకో నిర్వహించి, జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం సమర్పించారు.?బాధితుల విజ్ఞప్తిపై తక్షణమే స్పందించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు, మంగళవారం ఎస్సారెస్పీ. ఆర్డబ్ల్యూఎస్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ప్లాంట్ నిర్వహణ తీరును, కాలువ కట్టపై వాహనాల రాకపోకలను అధికారులు నిశితంగా పరిశీలించారు.ఈ విచారణ కార్యక్రమంలో ఎస్సారెస్పీ డీఈ రవి, ఏఈ పవిత్రతో పాటు కాంగ్రెస్ నాయకులు బత్తిని మహేష్, పరికి త్యాగరాజు, కోలా లింగయ్య, గాజు బిక్షపతి, సురేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# పీఎం శ్రీ మోడల్ పాఠశాలలో ఘనంగా ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమం



**గణపురం ప్రజాజ్యోతి డిసెంబర్ 30:** మండల కేంద్రంలోని పీఎం శ్రీ మోడల్ పాఠశాలలో పీఎం శ్రీ పథకంలో భాగంగా ఏక్ భారత్ శ్రేష్ట భారత్ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా హర్యానా వంటకాలు, వ్యాసరచన పోటీలు, సాంస్కృతిక నృత్యాలు ప్రదర్శించారు విద్యార్థులందరికీ హర్యానా స్వీట్లు పంపిణీ చేశారు పోటీల్లో విజేతలకు జనవరి 26న బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందని ఇన్చార్జి ప్రిన్సిపాల్ కె సురేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు , పాఠశాల సిబ్బంది,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్ కు కొడకండ్ల గురుకులం విద్యార్థినిలు

**కొడకండ్ల, డిసెంబర్ 30 (ప్రజాజ్యోతి) :** జనగామలో మంగళవారం తెలంగాణ మ్యాథ్స్ ఫోరం వారిచే నిర్వహించబడిన జిల్లాస్థాయి మ్యాథ్స్ టాలెంట్ టెస్టులో కొడకండ్ల గురుకులంకు చెందిన ఎం. సహస్ర, ఎ. సన ఇద్దరు రెసిడెన్షియల్ మరియు మోడల్ స్కూల్ కేటగిరిలో ప్రథమ స్థానం సాధించి ఇద్దరు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపల్ తమ్మి దిలీప్ కుమార్ ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 4వ తేదీన హైదరాబాదులో నిర్వహించే రాష్ట్రస్థాయి మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్ లో పాల్గొంటారని తెలియజేశారు. ఈ





సందర్భంగా విద్యార్థినులను ప్రిన్సిపల్ తో పాటు పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అభినందించారు.

# కరాటే పోటీలో కొడకండ్ల టీజీఆర్ఎస్ జేసీ విద్యార్థినికి సిల్వర్ మెడల్

**కొడకండ్ల, డిసెంబర్ (ప్రజాజ్యోతి) :** ఈనెల 29న పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలో భాగంగా ఎస్.జి.ఎఫ్.ఐ అండర్ 17 బాలికల విభాగంలో కొడకండ్ల మండల కేంద్రానికి చెందిన గురుకుల కళాశాల విద్యార్థిని శ్రీహరిని అత్యంత ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనితోపాటు



ఇటీవల ములుగులో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ 19 బాలికల విభాగంలో కూడా శ్రీహరిని పాల్గొని అక్కడ కూడా సిల్వర్ మెడల్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్ కుమార్ తెలిపారు. సిల్వర్ మెడల్ సాధించిన శ్రీహరినికి కళాశాల ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపకులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

# ఒకే ఒక్కడు పశు అక్రమ రవాణాదారుడు మాఫియా డాన్

**మూగ రోదన ఆర్తనాదాలు-అక్రమంగా పశువుల రవాణా**

**కబేలాలకు తరులుతున్న పశు సంపద-చర్ల చతిస్గడ్ సరిహద్దు ప్రాంతాల నుంచి తరలింపు.**

**చిన్న వాహనాల నుంచి పెద్ద వాహనాల్లోకి -పట్టుబడుతున్న ఆగని అక్రమ దందా**

**సరిహద్దు ప్రాంతాలే స్థావరాలు - తనిఖీలు శూన్యం**




**ఏటూర్ నాగారం డిసెంబర్ 30 ప్రజా జ్యోతి :** మూగజీవాల అక్రమ రవాణా యదేచ్ఛగా సాగుతోంది. ధనార్జన ధ్యేయంగా మండలంలోని రామన్నగూడెం కు చెందిన ఒకే ఒక్కడు మూగ జీవాల పశువుల అక్రమ రవాణా దారుడు ఏ నోట విన్న పశువుల అక్రమ రవాణా దారుడి పేరే మారుమోగుతుంది. కింది స్థాయి నుంచి మొదలుకొని జిల్లా స్థాయి ఉన్నతాధికారుల వరకు పెద్ద మొత్తంలో ముడుపులు ముట్ట చెప్పి తనకు అడ్డు చెప్పేవారు లేకపోవడంతో అడ్డు అదుపు లేకుండా తన ఇష్టానుసారంగా బుల్లోరా వాహనాలు . డీసీఎం. లలో జోరుగా పశు అక్రమ రవాణా లో మధ్య దళారులతో కలిసి అధికారుల అండదండలతో కబేలాలకు తరలిస్తున్నారు. అంటూ బహిర్గతంగా ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. దీంతో పశు సంపద క్రమంగా తగ్గిపోతుంది. చర్ల చతిస్గడ్ సరిహద్దు ప్రాంతంలో ప్రధాన స్థావరాలుగా ఏర్పరచుకొని నిత్యం ప్రతిరోజు అక్రమ రవాణా సాగిస్తున్నారు. ట్రాలీ. డీసీఎం. లాంటి వాహనాలలోతో పాటు ప్రత్యేక కంటైనర్లలో పశువులను కుక్కి ఎవరికి అనుమానం రాకుండా సరిహద్దులు దాటిస్తున్నారు. కంటైనర్లలో డీసీఎంలలో ఊపిరీ ఆడక పశువులు మృత్యువాత పడిన సందర్భాలు ఉన్నాయి. మూగజీవాల రవాణా చర్ల కేంద్రంగా చేసుకొని. వెంకటాపురం. జగన్నాథపురం. ములకట్ట వంతెన మీదుగా. ఏటూర్ నాగారం మండల కేంద్రం. కాటాపురం. ములుగు జిల్లా కేంద్రం మీదిగా హైదరాబాదులోని కబేలాలకు చేరుకుంటున్నాయి. అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంతో వీరి వ్యాపారం జోరుగా సాగుతుంది. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం పశువుల అక్రమ రవాణా పై ప్రత్యేక దృష్టి సారించి. నిగా పెట్టి అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు పేర్కొంటున్నారు. అక్రమ పశువుల రవాణా మాఫియాదారుడు గతంలో ఏటూర్ నాగారం.వాజేడు పోలీస్ స్టేషన్లో పట్టుబడి తన ఎస్కార్ట్ గా ఉపయోగించే కార్ సీజ్ చేసిన సందర్భాలు ఉన్నాయి. అధికారులకు తెలిసే వారికి ప్రతి నెల ముడుపులు ముట్ట చెప్పి అక్రమ రవాణా చేస్తున్నట్లు సదురు మాఫియా డాన్ బహిరంగంగా వ్యాఖ్యలు చేస్తున్నారని ప్రచారం సాగుతుంది. తనకు అడ్డు వచ్చి ప్రశ్నించిన వారిపై అధికారుల అండదండలతో వారిపై తిరిగి అక్రమ కేసులు బనాయిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. కొంతమంది వ్యక్తులు పత్రికా రంగ ముసుగులో నకిలీ లు పాత్రికేయులుగా చలామనీ అవుతూ పశు వుల అక్రమ రవాణా మాఫియాకు కొమ్ముకాస్తున్నారని విమర్శలు ఉన్నాయి. పత్రికారంగ ముసుగులో కొంతమంది దళారులు నకిలీ లు పాత్రికేయులుగా చలామనీ అవుతూ రాత్రి సమయంలో వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనాలలో జగన్నాథపురం .ముళ్లకట్ట వంతెన వద్ద పెట్రోల్ బంక్ పరిసర ప్రాంతాల్లో గస్తీలు నిర్వహిస్తూ పశువుల అక్రమ రవాణా వాహనాలను ఆపి వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. కబేలాలకు తరలిపోతున్న మూగజీవాల అర్ధనాదాలు ఎవరికి పట్టడం లేదా అని పలువురు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికార యంత్రాంగం దృష్టి సారించి తనిఖీలు నిర్వహించి పశు అక్రమ రవాణా అరికట్టి మూగ జీవాలను రక్షించాలని గ్రామీణ ప్రాంత ప్రజలు . నాయకులు కోరుతున్నారు.

# ఆలయంలో వైకుంఠ ఏకాదశి ప్రత్యేక పూజలు

**వరంగల్ సిటీ, డిసెంబర్ 30(ప్రజాజ్యోతి):** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని నగరంలోని పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం నగరంలోని శ్రీ బాలానగర వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెల్లవారుజామున నుంచే భక్తులు



పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అభిషేకాలు, విశేష అలంకరణ, వైకుంఠ ద్వార దర్శనం నిర్వహించగా ఆలయం భక్తిశ్రద్ధలతో కళకళలాడింది. స్థానిక డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన నవీన్ హాజరై స్వామి వారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి అనంతరం భక్తులకు సేవలు అందజేశారు.

# యూరియా బుకింగ్ యాప్ రైతులకు సులభం పారదర్శకం

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**

యూరియా బుకింగ్ యాప్ రైతులకు సులభంగా, పారదర్శకంగా, అవసరానికి అనుగుణంగా యూరియా పంపిణీ చేయడంలో అత్యంత ఫలప్రదంగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. యూరియా యాప్ ద్వారా జరుగుతున్న అమ్మకాలను



కలెక్టర్ మంగళవారంస్టేషన్ ఘనపూర్ పి.ఏ.సి.ఎస్ ని సందర్శించి ఫర్టిలైజర్ బుక్కింగ్ యాప్ పని తీరును స్వయంగా పరిశీలించారు. యాప్ పైన రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. యాప్ వల్ల యూరియా కొనుగోలు సులభమయ్యిందని రైతులు సంతోషం వ్యక్తం చేసారు. ఈ యాప్ ద్వారా రైతులు తమకు సమీపంలోని ఏ అధికారిక ఎరువుల విక్రయ కేంద్రం నుండైనా యూరియాను సులభంగా బుక్ చేసుకునే సౌకర్యం కల్పించబడిందన్నారు. జిల్లాలో ప్రస్తుతం తగినంత యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళనకు లోనుకాకుండా యాప్ ద్వారా బుకింగ్ చేసుకోవచ్చున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఎరువుల డీలర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తూ, రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. పంట దశను బట్టి అవసరమైన సమయంలో మాత్రమే యూరియాను బుక్ చేసుకోవాలని మొత్తం సీజన్ అవసరాన్ని ఒకేసారి బుక్ చేసుకోవడానికి తొందరపడవద్దన్నారు.రైతులకు స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు. జనగాం జిల్లా రాష్ట్రంలోనే యూరియా బుకింగ్ యాప్ వినియోగంలో ముందంజలో ఉందని, కేవలం 8 రోజుల వ్యవధిలో (22 డిసెంబర్ 2025 నుంచి 30 డిసెంబర్ 2025 వరకు) జనగాం జిల్లాలో మొత్తం 70452 యూరియా సంచులు యాప్ ద్వారా బుక్ అయ్యిందన్నారు. యూరియా బుకింగ్ యాప్ ద్వారా రైతులకు కలిగిన ముఖ్య ప్రయోజనాలు: పీపిబి నంబర్ మరియు పంట వివరాలతో సులభంగా బుకింగ్, అందుబాటులో ఉన్న యూరియా కోటా స్పష్టంగా కనిపించడం, సమీపంలోని అధికారిక విక్రయ కేంద్రం ఎంపిక అవకాశం, ఎరువుల దుకాణాల వద్ద రద్దీ తగ్గింపు అక్రమాలు, ద్వంద్వ విక్రయాలకు అడ్డుకట్ట, రైతుల సమయం మరియు ఖర్చు ఆదా, ఈ నేపథ్యంలో, మంగళవారం యూరియా బుకింగ్ యాప్ ద్వారా జరుగుతున్న యూరియా విక్రయ ప్రక్రియను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలోని అన్ని ఎరువుల విక్రయ కేంద్రాల్లో యూరియా సంచులు సరిపడినంతగా అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. డీలర్లకు సూచనలు జారీ చేస్తూ, యాప్ ద్వారా బుకింగ్ ఐడి తో రైతు వచ్చిన వెంటనే ఎలాంటి ఆలస్యం చేయకుండా, తక్షణమే యూరియా విక్రయ ప్రక్రియను పూర్తిచేయాలని స్పష్టం చేశారు. బుకింగ్ ఉన్నప్పటికీ విక్రయంలో ఆలస్యం చేయడం లేదా పెండింగ్‌లో ఉంచడం అనుమతించబడదని హెచ్చరించారు. అదేవిధంగా రైతులు తాము సాగు చేస్తున్న పంటకు మాత్రమే, పంట దశను బట్టి అవసరమైన సమయంలోనే యూరియాను యాప్ ద్వారా బుక్ చేసుకోవాలని రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమం లో జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోని తదితరులు పాల్గొన్నారు.

# రాయపర్తి, ఐనవోలు దేవస్థానాలలో ప్రత్యేక పూజలు

**సర్పంచ్ గారే సహేంద్ర బిక్షపతి**

**రాయపర్తి డిసెంబర్ 30 ప్రజా జ్యోతి:**
ముక్కోటి ఏకాదశి పండుగ సందర్భంగా శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం ఐనవోలు,శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం (రామాలయం) రాయపర్తి లో ప్రత్యేక పూజలు సోమవారం నిర్వహించారు.రాయపర్తి లో ప్రధాన అర్చకులు ఆరుట్ల రామకృష్ణ చార్యులు సర్పంచ్ తో ప్రత్యేక పూజలు చేశారు .రాయపర్తి గ్రామ సర్పంచ్ గారే సహేంద్ర-బిక్షపతి ఈ సందర్భంగా మాట్లాడుతూ రాయపర్తి గ్రామ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతున్ని కోరుకోవడం జరిగిందని ప్రజలందరికీ ముక్కోటి ఏకాదశి పండుగ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ పిఏసిఎస్



మాజీ డైరెక్టర్ కుంట రమేష్ యాదవ్,వార్డు సభ్యులు కుంట రాజు యాదవ్,చేగుండ సాయిచేగొండ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పెగడపల్లి క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డు ప్రమాదం వ్యక్తి కి గాయాలు

**హసన్‌పర్తి,డిసెంబర్-30(ప్రజాజ్యోతి):**
హసన్‌పర్తి మండలం పెగడపల్లి క్రాస్‌రోడ్డు సమీపంలో శుక్రవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న వ్యక్తి వాహనం అదుపుతప్పి రోడ్డు మధ్య డివైడర్ కు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ముఖ్యంగా తలకు తీవ్రమైన గాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108 అంబులెన్సు కు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న హసన్‌పర్తి 108 సిబ్బంది పైలట్ కోటిలింగం, మెడికల్ టెక్నీషియన్ సురేష్ ఘటనాస్థలికి



చేరుకుని ప్రాథమిక చికిత్స అందించి క్షతగాత్రుణ్ని వరంగల్ మహాత్మా గాంధీ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తిని సీతారాం నాయక్ గా గుర్తించారు. ఇతడు బీహార్ రాష్ట్రానికి చెందినవాడిగా, రహదారి నిర్మాణ పనుల్లో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నట్లు తెలిసింది. ప్రమాద కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు.

# మీ భద్రత - ప్రయాణికుల భద్రత మన అందరి బాధ్యత

**ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించిన సీఐ ఇంద్రసేనా రెడ్డి**

**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి,( ప్రజా జ్యోతి), డిసెంబర్ 30 :**
రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా గోదావరిఖని- టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనా రెడ్డి ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియమాల పాటింపు, సురక్షిత ప్రయాణం, మద్యం సేవించి వాహనం నడపకూడదనే అంశాలపై డ్రైవర్లకు విస్తృతంగా అవగాహన కల్పించారు.వాహనానికి సంబంధించిన డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పొల్యూషన్ పత్రాల ప్రాముఖ్యతను వివరించారు. అన్ని పత్రాలు చెల్లుబాటు అయ్యేలా ఉంచుకోవాలని, ప్రమాదం జరిగినప్పుడు ఇన్సూరెన్స్ వర్తించాలంటే తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సీఐ ఇంద్రసేనా రెడ్డి మాట్లాడుతూ, ప్రయాణికుల భద్రతలో ఆటో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రతి డ్రైవర్ బాధ్యతాయుతంగా వాహనం నడిపితే అనేక రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ఆటోలో తమ కుటుంబ సభ్యులు, తల్లిదండ్రుల ఫోటోలు ఉంచుకోవాలని సూచిస్తూ, మద్యం సేవించి వాహనం నడిపే సమయంలో లేదా తప్పు చేసే వేళ ఆ ఫోటోలను చూసి కుటుంబ భవిష్యత్తును గుర్తు



చేసుకోవాలని హితవు పలికారు.మీరు చేసే చిన్న తప్పు వల్ల కూడా కుటుంబం రోడ్డుపాలయ్యే పరిస్థితి రావచ్చని హెచ్చరిస్తూ, ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.అలాగే ఏదైనా అనుమానాస్పద సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. కొందరి ఆటో డ్రైవర్ల తప్పు ప్రవర్తన వల్ల మొత్తం వృత్తికే చెడ్డ పేరు వస్తోందని, అలాంటి వారి వివరాలు అందిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు

# ఇటుకబట్టిల్లో పిల్లలను బడిలో చేర్పించాలి

**మండల విద్యాధికారి ప్రభాకర్**

**ధర్మారం డిసెంబర్ 30(ప్రజా జ్యోతి న్యూస్):**
ప్రతీ ఒక్కరి జీవితంలో బాల్యదశ అతి ముఖ్యమైనదని,ఈ దశలో పిల్లలను ఇటుకబట్టిల్లో ఉంచి వారిని విద్యనుండి దూరం చేయవద్దని,బాల్యన్ని ఇటుకబట్టిల్లో బందీగా మార్చవద్దని ధర్మారం మండల విద్యాధికారి పోతు ప్రభాకర్ అన్నారు.మంగళవారం ఉదయం ఓ.ఎస్. సీ (బడిబయట పిల్లల) సర్వేలో భాగంగా మండలంలోని బొమ్మారెడ్డిపల్లి సమీపంలో పలు ఇటుకబట్టీలను ఆయన సందర్శించి పదిహేను మంది పిల్లలను స్థానిక ధర్మారం మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు.సమగ్ర శిక్షా కార్యక్రమం ద్వారా అందరికీ విద్య మనందరి భాధ్యత అనీ, అందరినీ



చదివించేలా,జీవితంలో అందరూ ఉన్నంతంగా ఎదిగేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని మండల విద్యాధికారి పేర్కొన్నారు.

# వీధి కుక్కల స్వైర విహారం



**భీమదేవరపల్లి: డిసెంబర్ 30 ప్రజా జ్యోతి:**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం లోని పలు గ్రామంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కొత్తపల్లి గ్రామానికి లో రోడ్డు పై నడుచుకుంటూ వెళ్తున్న రిషి (12) అనే బాలుడి పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. బాలుడి పై వీధి కుక్కలు దాడి చేయడాన్ని గమనించిన స్థానికులు వీధి కుక్కలను కర్రలతో తరిమి బాలుడిని రక్షించారు. కుక్కల దాడిలో బాలుడి కాలికి తీవ్ర గాయాలు కాగా 108 లో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. గ్రామస్థులతో కలిసి గ్రామ సర్పంచ్ వీధి కుక్కలను గ్రామంలో నుండి కర్రలతో తరిమి కొట్టించి బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. బాటసారిలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి బాటసారిలను కాపాడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# ముగ్గురికి 14 రోజుల రిమాండ్

**శాయంపేట డిసెంబర్ 30 ప్రజా జ్యోతి :**
పేలుడు పదార్థాల కేసులో అరెస్ట్ అయిన నిందితులను మంగళవారం రిమాండ్ కు తరలించినట్టు స్థానిక ఎస్సై జక్కుల పరమేశ్వర్ తెలిపారు వారు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రోజున ఎస్సై పోలీస్ సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తుండగా పత్తిపాక గ్రామంలో గల చిన్న బ్రిడ్జి వద్ద ముగ్గురు వ్యక్తులు అనుమానస్పందంగా కనిపించగా వెంటనే వారిని విచారించగ వారి వద్ద ప్రేలుడు పదార్దాలు లభించడంతో వెంటనే పంచుల సమక్షంలో వాటిని అదుపులోకి తీసుకొని వారిని విచారించగ యాదాద్రి జిల్లా చెందిన బొంత శ్రీను అను వ్యక్తి తన బంధువులు అయిన ఇరుగదిండ్ల శివశంకర్,బొంత అజయ్ తో కలిసి ఆత్మకూర్ గ్రామస్తుడు అయిన తంగేళ్ల బ్రహ్మం వద్ద ప్రేలుడు పదార్దాలు తక్కువ ధరకి కొని ఎక్కువ ధరకి అమ్ముకునే వాడు అదే విదంగా 11000 వేల రుపాయలకి ప్రేలుడు పదార్దాలు బ్రహ్మం దగ్గర కొని వసంతాపూర్ గ్రామస్థులు అయిన చల్ల రాజిరెడ్డి కు ఇవ్వడానికి వెళ్తుండగా పట్టుకొని అదుపులోకి తీసుకున్నామన్నారు. మంగళవారం పరకాల జడ్జ్ ముందు రిమాండ్ కొరకు హాజరు పరచగా 14 రోజుల జ్యూడిషల్ రిమాండ్ విధించడం జరిగిందని తెలిపారు.

# మతాలు వేరైనా భక్తి ఒక్కటే

**వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మైనార్టీ నేత ఎంఏ సమద్**

**తిమ్మాపూర్ డిసెంబర్ 30 ( ప్రజాజ్యోతి ):**
కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి కాలనీలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరుగుతున్న వేళ మత సామరస్యానికి ప్రతీక గా ఒక అరుదైన సన్నివేశం ఆవిష్కృతమైంది. దీనికి ఇంతటి ప్రాధాన్యత ఎందుకంటే ముస్లిం మైనార్టీ సామాజిక వర్గానికి చెందిన నేత ఎంఏ సమద్ కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ ఎం డి కాలనీలోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి పూర్వకంగా పూజలు చేశారు.ఈ సన్నివేశం మత సామరస్యానికి, సౌభ్రాతృత్వానికి ఆదర్శంగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. వైకుంఠ ఏకాదశి రోజున ఉత్తర ద్వార దర్శనం మోక్ష ప్రాప్తికి దారి తీస్తుందనే నమ్మకంతో రాష్ట్రవ్యాప్తంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్న నేపథ్యంలో ముస్లిం మైనార్టీమతాలు వేరైనా భక్తి ఒక్కటే. వర్గానికి చెందిన నేత ఈ ప్రత్యేక పూజలు చేయడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఈ సందర్భంగా ఎం ఏ సమద్ మాట్లాడుతూ, దేవుడు ఒక్కడే,మతాలు వేరైనా భక్తి ఒక్కటే. వెంకటేశ్వర స్వామిపై నాకున్న భక్తి కారణంగా ఈ పూజలు నిర్వహించాను అని తెలిపారు. ఇటీవల మహాత్మానగర్లో జరిగిన అయ్యప్ప స్వామి ఆలయ ప్రతిష్టాపన కార్యక్రమంలోనూ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించానని చెప్పారు.